క్లుప్తంగా

ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక



మచిలీపట్నంఅర్బన్: కృష్ణా జిల్లాకు చెందిన గోపిశెట్టి కార్తికేయ ఏపీ ఫుట్‌బాల్ జట్టులో స్థానం దక్కించుకున్నారు. మచిలీపట్నంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్న కార్తికేయ, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో జరిగే బీసీ రాయ్ ట్రోఫీలో జాతీయ స్థాయిలో ఆడనున్నాడు. విశాఖపట్నంలో జరిగిన జూనియర్ బాలుర ఫుట్‌బాల్ శిక్షణ శిబిరంలో శిక్షణ తీసుకున్నారు. నేషనల్స్‌కు ఎంపికైన కార్తికేయ జిల్లా క్రీడావర్గాల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాడు.

శాకంబరిగా భ్రమరాంబదేవి



టి.కొత్తపాలెం(నాగాయలంక): ఆషాఢ మాసంలో శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం గ్రామస్తులు, భక్త సమాజాలు, భజన బృందాల ఆధ్వర్యంలో అమ్మవారికి శాకంబరీదేవి మహోత్సం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో శ్రీభ్రమరాంబ, శ్రీమల్లేశ్వరస్వామి మూలవిరాట్‌లకు 100 కిలోల కూరగాయలు, ఆకుకూరలతో అలంకార శోభను చేకూర్చారు. టి.కొత్తపాలెం, తలగడదీవి, పరిసర గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయానికి మిల్క్ పాస్టరైజర్ బహూకరణ



మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఎం.రవిచంద్ర, సౌజన్య, రుత్విక్ దేవస్థానంలో భక్తుల పిల్లలకు వేడిపాలు అందించే మిల్క్ పాస్చరైజర్ (పాలు వేడిచేసే హీటర్) మంగళవారం బహూకరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించుకున్న అనంతరం మండలి వెంకట్రామ్ నుంచి ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందజేశారు.

నందీశ్వరుడికి స్వీయాభిషేకాలు



నాగాయలంక: ఆషాఢ బహుళ త్రయోదశి విశిష్టత పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాద క్షేత్రం వద్ద కృష్ణానదిలోని శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి మండపంలో మంగళవారం రాత్రి నందీశ్వరుడికి భక్తులతో స్వీయ అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహించారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటర్ తలశిల రఘుశేఖర్ నేతృత్వంలో అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో ప్రదోష కాలంలో పంచామృతాల వేడుక జరిపారు. ఈ సందర్భంగా శ్రీరామలింగేశ్వరస్వామి, నందీశ్వరుడికి విశేష అలంకారం చేశారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



కోనేరుసెంటర్: రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి (ఏడీఏ) రమాదేవి తెలిపారు. భోగిరెడ్డిపల్లి, గరాలదిబ్బ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ రైతులు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో రూ.830 ప్రీమియం చెల్లిస్తే రూ.41,500 వరకు బీమా పొందే అవకాశం ఉంటుందన్నారు. వీఏఏ కిరణ్మయి, ఎంఏఓ రామ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

కోనేరుసెంటర్: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. అతని నుంచి 41 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మేకల మారుతి అనే వ్యక్తి తన వాహనంలో మద్యం సీసాలు పెట్టి అమ్ముతున్నాడు. సమాచారం అందుకున్న సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకుని వాహనాన్ని పరిశీలించగా 40 మద్యం సీసాలు కనిపించాయి. సిబ్బందిని వాటిని స్వాధీనం చేసుకుని మచిలీపట్నం ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి వాహనాన్ని తరలించి మారుతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మణరావు తెలిపారు. సిబ్బంది సుబ్రహ్మణ్యం, వేణు, రంజిత్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాటలతో సరి.. ముంచేశాయి మరి

ఒక్క రోజు కురిసిన వానకే డ్రెయిన్లు పొంగడంతో 'అవనిగడ్డ'లో పంట పొలాలు నీట మునిగాయి. పూడికల తొలగింపులో కూటమి పాలకులు అంతన్నారు.. ఇంతన్నారు.. స్ప్రే చేశామని డాబులు కొట్టారు. గుర్రపుడెక్కను కూడా చంపేశామని ఊదరగొట్టారు. చివరకు ఒక్క రోజు కురిసిన వానకే పంట పొలాలు నీటి మునిగాయి. పూడికలు తీయడానికి పాలకులు ఖర్చు పెట్టామని ప్రచారం చేసుకుంటున్న రూ.కోట్ల నిధులు ఎటు వెళ్లాయో.. ఎవరి జేబులోకెళ్లాయో తేలాల్సి ఉంది.

- రూ. కోట్ల నిధులు డ్రెయిన్ల పాలు
- ఒక్క రోజు వానకే పొంగిన డ్రెయిన్లు
- నీట మునిగిన నారుమళ్లు, పంటపొలాలు
- నాడు డ్రోన్‌లతో స్ప్రే చేశామన్నారు
- నేడు పొక్లెయిన్లతో తొలగిస్తున్నారు

రూ.2.25 కోట్లు ఎవరి జేబులోకెళ్లాయో!



డ్రెయిన్ పొంగడంతో దేవరకోటలో నీట మునిగిన పొలాలు



గుండేరు డ్రెయిన్‌పై కొత్తమాజేరు వంతెనకు ఒకవైపు కుప్పలుగా చేరిన గుర్రపుడెక్క



డ్రోన్లతో మందు పిచికారీ చేయిస్తే ఈ గుర్రపుడెక్క ఎక్కడిది?

అవనిగడ్డ: పంట కాలువలు, డ్రెయిన్లను బ్రహ్మాండంగా మార్చేశామని, గతంలో ఎప్పుడూ లేనివిధంగా రూ.2.25 కోట్లతో పూడికల పనులు చేయించామని పాలకులు ఊదరగొట్టేశారు. ఇంకేముంది డ్రోన్లతో డ్రెయిన్లలో గుర్రపుడెక్కనే చంపేశామని హడావుడి చేశారు. కట్ చేస్తే వారి మాటలు ఉత్తుత్తివే అని ఒక్క రోజు కురిసిన వాన తేల్చేసింది. ఎందుకంటే ఇటీవల ఒక్క రోజు కురిసిన వానకు పొలాలు నీట మునిగాయి. డ్రెయిన్ల నిండా ఉన్న గుర్రపుడెక్క వంతెనల వద్దకు చేరింది. ఈ పరిస్థితి చూసిన రైతాంగం హవ్వ ఇదా మీరు చేసిన అభివృద్ధి అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. కోట్లాది రూపాయల నిధులు ఎవరి జేబులోకి వెళ్లాయో యువనేతకే ఎరుక అని రైతులు తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

ఒక్క రోజుకే.. బయటపడ్డ బండారం?

నియోజకవర్గంలోని కేఈబీ కెనాల్‌తో పాటు మిగిలిన పంటకాలువలు, ప్రధాన డ్రెయిన్ల పూడికతీతకు రూ.2.25 కోట్ల నిధులు మంజూరు చేశారు. రైతుల సమస్యలు తొలగినట్టే అని గొప్పలు చెప్పారు. గత ప్రభుత్వం కాలువలు, డ్రెయిన్లను పట్టించుకోలేదని, తాము చాలా బాగా చేశామని స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ గొప్పలు చాటారు. తీరా ఒక్క రోజు కురిసిన వర్షానికే డ్రైన్లు పొంగి ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో పంట పొలాలను ముంచెత్తాయి. కడుపుమండి ఘంటసాల మండలంలోని దేవరకోట వద్ద రైతులు ఆందోళన చేశారు.

డ్రోన్‌లతో స్ప్రేచేయిస్తే.. ఈ గుర్రపుడెక్క ఎక్కడిది?

ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో ప్రధాన డ్రెయిన్ గుండేరులో గుర్రపు డెక్క తొలగింపునకు రూ.27.29 లక్షలు ఖర్చుచేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా డ్రోన్‌ల సాయంతో మందు పిచికారీ చేశామని కూటమి నేతలు గొప్పలు చెప్పారు. ఇక డ్రైన్లలో గుర్రపుడెక్కే ఉండదని చెప్పారు. మూడు రోజుల క్రితం ఘంటసాల మండలంలో కురిసిన వర్షానికే పలుచోట్ల నాట్లు వేసిన పంటపొలాలు మునిగిపోయాయి. డ్రైన్లలోని గుర్రపుడెక్కంతా వంతెన వద్దకు చేరింది. వీటిని పొక్లెయిన్లతో తొలగించే పనులు చేస్తున్నారు. తూతూ మంత్రంగా పనులు చేసి కోట్లాది రూపాయల నిధులు దోసేసుకున్నారని కొంత మంది రైతులు విమర్శిస్తున్నారు.

కొట్టుకుపోయిన తడికెలు

మోపిదేవి మండలంలో రూ.26.40 లక్షలతో డ్రెయిన్లను అభివృద్ధి చేశారు. కొన్నిచోట్ల పంటకాలువలు పూడికతీత చేయగా, మరికొన్ని చోట్ల పంటకాలువ గట్లను తడికెలు అడ్డుపెట్టి బలోపేతం చేశారు. ఇంకొన్ని ప్రాంతాల్లో గుర్రపుడెక్క తొలగింపునకు స్ప్రే చేయించారు. చిర్లపాలెం వద్ద కాలువ గట్లు బలోపేతం చేశామని పాలకుల చెప్పారుగానీ ఒక్క రోజు కురిసిన వర్షానికే తడికెలు కొట్టుకుపోయాయి.

గుండె ఏరు..

చిన్నాపురం వంతెన వద్ద పెరుగుతున్న గుర్రపుడెక్క

చల్లపల్లి: గుండేరు డ్రెయిన్‌లో తూటికాడ, గుర్రపుడెక్క, కిక్కిస వంటివి పేరుకుపోవడంతో ముంపు సమస్య ఎదురైంది. కలుపు మందు పిచికారీతో తొలగిపోయే సమస్యను డ్రెయిన్ పొంగే వరకూ తీసుకొచ్చారు. పమిడిముక్కల మండలం పెనమకూరు వద్ద బందరు కాలువకు ఏర్పాటుచేసిన మోపిదేవి సర్‌ప్లస్ ఎస్కేప్ పాయింటు వద్ద గుండేరు ప్రారంభమై మచిలీపట్నం పాతూరు వద్ద సముద్రంలో కలుస్తుంది. చల్లపల్లి డ్రెయినేజీ శాఖ పరిధిలోని గుండేరుకు 61.6కి.మి. నుంచి 16.7కి.మి. వరకూ 44.9కిమీ మేర తూటు, గుర్రపుడెక్క తొలగించేందుకు రూ.27.29 లక్షలు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేయకపోవడంతో ఈనెల 19న ఒక్కసారిగా నీటి ఉద్ధృతి పెరిగింది. గుండేరుపై 12కుపైగా వంతెనలు ఉండగా అవనిగడ్డ నియోజకవర్గంలో వేములపల్లి, నేతగాని దళితవాడ, దేవరకోట, బిరుదుగడ్డ, లంకపల్లి, కొత్తమాజేరుల్లో ఆరు వంతెనలు ఉన్నాయి. ఆరు వంతెనల వద్ద గుర్రపుడెక్క గుట్టలుగా చేరి నీటిని ముందుకు కదలనివ్వడం లేదు.



బందరు మండలం చిన్నాపురం వంతెన వద్ద పేరుకుపోతున్న గుర్రపుడెక్క

ఎలా పొంగిందంటే

వర్షాలు లేకపోయినా గుండేరులో ఇంత నీరు ఎక్కడ నుంచి వచ్చిందనేది అర్థం కాని ప్రశ్న. బందరు కాలువ నుంచి మోపిదేవి సర్‌ప్లస్ ఎస్కేప్ పాయింటు వద్ద గుండేరులోకి నీటిని వదడంతో ఈ ముంపు సమస్య వచ్చినట్లు పలువురు పేర్కొంటున్నారు. బందరు కాలువతోపాటు ఏనుగులకోడు, ధూళిపూడిపాలెం వద్ద దేవరపల్లి డ్రెయిన్, మల్లాయిచిట్టూరు వద్ద భీమనది డ్రెయిన్ నీరు వచ్చి గుండేరులో కలుస్తాయి. దీంతో ఈ ప్రాంతభూములు ముంపునకు గురవుతున్నాయి. సక్రమంగా డ్రెయిన్ల పనులు చేయిస్తే సమస్య ఉండదని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

మానవ తప్పిదమే



అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని గుండేరుపై ఉన్న ఆరు వంతెనల వద్ద గుర్రపుడెక్క అడ్డుపడి ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. కాంట్రాక్టర్ పనులు చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఇది కచ్చితంగా మానవ తప్పిదమే.

– వేమూరి రత్నగిరిరావు, ఏపీ రైతుసంఘం, అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు

తూటు తొలగించాలి



వర్షాలు కురిస్తే గుండేరులో నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్నేళ్ల క్రితం అధిక వర్షాలకు గుండేరు పొంగి నాలుగు వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయి. మళ్లీ రెండోసారి నాట్లు వేసి నష్టపోయాం. కాలువల్లో తూటు తీయాలి.

–అరేపల్లి శ్రీనివాసరావు, రైతు, మాజేరు

కొత్తమాజేరులో రోడ్డుకు గండి



గుండేరు డ్రెయిన్ వద్ద వంతెనపై గండి



రోడ్డుకు గండిపడటానికి కొంతసేపటి క్రితం వెళ్లిన బస్సు

నిలిచిపోయిన రాకపోకలు

చల్లపల్లి: కాంట్రాక్టర్, పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అనాలోచిత చర్యల కారణంగా నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడం కోసం ఏకైక వంతెనకు ఉన్న రోడ్డు డ్రెయిన్ ప్రవాహానికి గండిపడి మంగళవారం సాయంత్రం కొట్టుకుపోయింది. దీంతో చల్లపల్లి–మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి కొత్తమాజేరు, భోగిరెడ్డిపల్లి, చిన్నాపురం, యాదర ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. గుండేరులో తూటు, గుర్రపుడెక్క తొలగించకపోవడంతో ఎగువ నుంచి వచ్చిన నీటి కారణంగా ఈనెల 19వ తేదీ రాత్రి డెక్కంతా వచ్చి కొత్తమాజేరు వంతెన వద్ద పేరుకుపోయింది. వంతెనకు ఉన్న 12 ఖానాల్లో కేవలం రోడ్డుకు ఆనుకుని ఉన్న ఖానాలో నుంచి మాత్రమే నీరు ముందుకు ప్రవహించడంతో అక్కడ రోడ్డు కోతకు గురైంది. మరుసటి రోజు అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి హడావుడి చేశారు. రెండు పొక్లెయిన్లు పనులు చేస్తున్నా.. మూడు రోజుల నుంచి కొద్దిపాటి గుర్రపుడెక్క కూడా తొలగించలేకపోయారు. ఎక్కడైతే రోడ్డు కోతకు గురైందో అక్కడే ఉన్న వంతెన ఖానా వద్ద గుర్రపుడెక్కను తొలగించడంతో ప్రవాహం పెరిగి రోడ్డు మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రవాహ వేగానికి మంగళవారం సాయంత్రానికి రోడ్డుకు గండిపడి పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. రెండు రోజులుగా అక్కడే పనులు చేస్తున్నారు.

ఒక్కసారిగా కుంగింది

మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో రోడ్డు ఒక్కసారిగా కిందకు కుంగిపోయి అక్కడ పెద్ద గుంతపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం జరగలేదు. రోడ్డు కూలడానికి కొంత సమయం ముందే స్కూల్ పిల్లలతో బస్సు అటుగా వెళ్లింది. నిత్యం రద్దీగా ఆ మార్గంలో రోడ్డుకు గండిపడటంతో పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకుల, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఈ పరిస్థితి ఏర్పడిందని దుయ్యబడుతున్నారు. అసలే శిథిలావస్థలో ఉన్న వంతెనపై భారీ పొక్లయిన్‌ను ఎక్కించడంతో వంతెనకు కూడా ముప్పు ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును బాగుచేయించాలని కోరుతున్నారు.

చినుకులతో చిగురించిన ఆశలు



కృత్తివెన్ను మండలం యండపల్లి వద్ద నారుమడిలో కూలీలు

కృత్తివెన్ను: ప్రభుత్వం సాగుకు సకాలంలో నీరందించకపోయినా వరుణదేవుడి దయతో రైతుల్లో ఆశలు చిగురించాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. నిన్నటి వరకు అధిక ఉష్ణోగ్రతలకు తోడు వేడిగాలుల కారణంగా నారుమడులు, వెదజల్లిన చేలు ఎండిపోయి చనిపోయే దశకు చేరుకున్నాయి. ఈ సమయంలో కాలువల్లో సైతం నీరులేకపోవడంతో రైతులు ఆందోళనలకు సైతం సిద్ధమయ్యారు. ఈ సమయంలో కురిసిన వర్షాలు రైతుల్లో సంతోషాన్ని నింపాయి. జోరుగా వరినాట్లు వేస్తున్నారు.



అడ్డపర్ర వద్ద వరినాట్లు వేస్తున్న మహిళలు

80 ఏళ్ల నాంచారయ్యను దత్తత తీసుకున్న మరో వృద్ధుడు

మెరకనపల్లి(మోపిదేవి): ఎనిమిది దశాబ్దాలు నిండిన మాజీ సర్పంచ్ వంగల నాంచారయ్యను అదే గ్రామానికి చెందిన వృద్ధుడు యర్రంశెట్టి నాగబాబు దత్తత తీసుకోవడం అభినందనీయమని పీ4 రాష్ట్ర ప్రోగ్రాం అధికారి అనపర్తి వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని మెరకనపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మీ అధ్యక్షతన మంగళవారం పీ4 గ్రామ సభ నిర్వహించారు. వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఒంటరిగా జీవిస్తున్న వృద్ధుడు మాజీ సర్పంచ్ నాంచారయ్యను గ్రామ పంచాయతీలో వాటర్ ట్యాంక్ వాచర్‌గా పనిచేస్తున్న నాగబాబు దత్తత తీసుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. పీ4ప్రత్యేక అధికారి వేణుమాడి సాయిబాబు, ఎంపీపీ రావి దుర్గావాణి పాల్గొన్నారు.



మెరకనపల్లి సభలో దత్తత తీసుకున్న నాగబాబును సత్కరిస్తున్న పీ4 ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వరరావు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి జన్మదిన వేడుకలు

అవనిగడ్డ: అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు జన్మదిన వేడులకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీనారాయణ, ఎంపీపీ సుమతీదేవి, అవనిగడ్డ సర్పంచ్ ఉమ, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీనివాసరావు, పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి జయగోపాల్ కేక్ కట్ చేసి నాయకులకు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పులిగడ్డ సర్పంచ్ విజయకుమార్, రాధా రంగా మిత్రమండలి దివియూనిట్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: మోపిదేవిలో మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సింహాద్రి జన్మదిన వేడుకలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు శివనాగరాజు, మండల పార్టీ బీసీ కన్వీనర్ నాగేశ్వరావు, ఎస్సీసెల్ మండల కన్వీనర్ పూర్ణచంద్రరావు, జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న నేతలు, ప్రజాప్రతినిధులు

చల్లపల్లి: చల్లపల్లి ప్రధాన సెంటర్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ, మహిళా కన్వీనర్ లక్ష్మి, ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యాప్రమాణాలు మరింత పెరగాలి

పెడన: క్షేత్రస్థాయిలో విద్యాప్రమాణాలు బాగా మెరుగవ్వాల్సి ఉందని ఎంఈవో–2 వైవీ హరనాథ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కూడూరు, పట్టణంలోని బంగ్లా స్కూల్, బీజేకేజెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠాలు చదివించడం, వారి నోటు పుస్తకాలను చూసి చేతిరాత ఎలా ఉందో పరిశీలించారు. అనంతరం పాఠశాలల రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సంఖ్య తదితర వాటిని అడిగి తెలుసుకోవడంతో పాటు ఎస్ఎంసీల నిర్వహణ తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలతో విద్యార్థుల చేతి రాత మెరుగుపరచాల్సిందిగా సూచించారు.



విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈవో–2 హరనాథ్

శ్మశానవాటిక వద్ద శివయ్య విగ్రహం



కోడూరు: కోడూరు శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. దాతల సహకారంతో ఇప్పటికే శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్, మెరకపనులను పూర్తి చేశారు. ప్రస్తుతం శ్మశానవాటిక లోపల భాగంలో దహన సంస్కారాలకు ప్లాట్‌ఫాంలను నిర్మిస్తున్నారు. అద్దె గృహాల్లో నివసించే వారు మరణిస్తే వారి మృతదేహాలను ఉంచడానికి వీలుగా శ్మశానవాటికలోనే ప్రత్యేక గదిని ఏర్పాటు చేస్తున్నారు. శ్మశానవాటిక ప్రధాన ద్వారం వద్ద ఆర్చి నిర్మాణాన్ని చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్చి నిర్మాణం పూర్తి చేసి ముఖ్యద్వారంపై శివయ్య విగ్రహాన్ని చూడచక్కగా రూపుదిద్దుతున్నారు. హిందువులు, క్రైస్తవుల శ్మశానవాటికలు వేర్వేరుగా ఉండేలా ప్రహరీ నిర్మాణాలు చేయడానికి అభివృద్ధి కమిటీ చర్యలు తీసుకుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో ఈనెల 23వ తేదీ బుధవారం విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్న కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎ.గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఈడేపల్లి పంచాయతీరాజ్ కాలనీ, రామ్‌నగర్ కాలనీ, పోస్టల్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు పనులు

కొడాలి(ఘంటసాల): ఘంటసాల మండల పరిధిలోని గుండేరు డ్రెయిన్‌పై ఉన్న వంతెనల వద్ద గుర్రపుడెక్క, తూటి కాడ తొలగింపు పనులు వేగవంతంగా చేస్తున్నట్లు లంకపల్లి నీటి సంఘం అధ్యక్షుడు పరిశే చలపతి తెలిపారు. కొడాలి వద్ద శ్రీకాకుళం రోడ్డులోని గుండేరు వంతెన వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులను మంగళవారం పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో తూటును తొలగిస్తామని చలపతి తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పెడన: వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు, సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కమలాపురం, చెన్నూరు వీఏఏలు ఫణీంద్ర, నరసింహనాయక్ అన్నారు. మంగళవారం కమలాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు సేంద్రియ ఎరువులతో ఉపయోగాలను, యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. రైతులకు కందిపప్పు విత్తనాలు అందజేశారు. సర్పంచి గుడిశేవ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.